

'ఉపాధి' కూలి చెల్లించాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని ఉపాధి హామీ కూలీలకు కూలి సొమ్ము జమ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల సొమ్ము తక్షణమే చెల్లించాలని నిరసన చేపట్టారు. ఎంపీడీవో కిరణ్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, ఉపాధి కూలి పనులు చేసి 90 రోజులు దాటుతున్నా ఖాతాల్లో సొమ్ము జమ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

25వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



అరకులోయలో మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలనను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. డుంబ్రిగుడలో కోలాటం ఆడుతూ తమ నిరసనను చేపటాటరు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

అరకులోయ :బెదిరింపులతో అంగన్వాడీలు చేపట్టిన ఉద్యమాన్ని అణిచి వేయలేరని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి అజశర్మ స్పష్టం చేశారు. అరకులోయలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడారు. గత టిడిపి హాయంలో చంద్రబాబు ప్రభుత్వం గుర్రాలతో తొక్కించిన అంగన్వాడీలు వెనక్కు తగ్గలేదని గత చరిత్రను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలని అజశర్మ సూచించారు. అంగన్వాడి కార్యకర్తలతో ఏ ప్రభుత్వం పెట్టుకున్నా ఇంటిలో కూర్చోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడీలతో పెట్టుకున్న చంద్రబాబు అధికారం కోల్పోయారని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలే అమలు చేయమంటున్నారని ఆయన అన్నారు. మాట తప్పని మడమ తిప్పని జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే తెలంగాణ కన్నా ఎక్కువ జీతాలు ఇస్తామని చెప్పిన జగన్ మాటలు ఇప్పుడు ఏమయ్యాయి అని ఆయన ప్రశ్నించారు.జగన్ కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అంగన్వాడీల వర్కర్స్ ఎండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమ్మ, నిర్మల, రాధ, భారతి, వెంకటలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో...

పాడేరు:తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం ఐటిడిఏ ఎదుట నిరసన దీక్ష కొనసాగించారు.అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 25వ రోజు కొనసాగింది. జనవరి 5 నుంచి విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రతులను అంగన్వాడి వర్కర్లు దగ్ధం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం పట్ల మొండి వైఖరి ఆలంబిస్తోందని అంగన్వాడీ వర్కర్లు నిరసన నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అల్లూరి జిల్లా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం తమ సమస్యలన్నీ పరిష్కరించే వరకు పోరాటం సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు చిన్నారి, దేవి, విజయ, అంబికా, జయ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో అంగన్వాడీల నిరవధిక సమ్మెకు మధ్యాహ్న భోజన కార్మికులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్, సిఐటియు జిల్లా నాయకుడు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామదాసు, నరసయ్య, గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, పార్వతి, సుజాత, మౌలమ్మ, ఈశ్వరమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో...

డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడిలు కోలాటం ఆడుతూ తమ నిరసనను తెలియజేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేపడతామని అంగన్వాడిలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కే.కొండమ్మ, కె సత్యవతి, జీ.పవిత్ర పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో....

చింతపల్లి:అంగన్వాడీల సమ్మెకు సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు

అనంతగిరి:అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాని ప్రశ్నించారు.అంగన్వాడి కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు.

మారేడుమిల్లి : అంగన్వాడీ సమ్మె, రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరాయి. శుక్రవారం ఎటపాక మండలం గోకబాక గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ పద్మ అనారోగ్యంతో మృతి చెందడంతో దీక్షా శిబిరంలో ఐదు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కూడలి వద్ద అంగన్వాడీలు భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి, వై రామవరం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీలు

చింతూరు : అంగన్వాడీల 25వ రోజు రోజు ఆందోళనను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామలక్ష్మి, కే.రాణి, అన్నపూర్ణ, విజయ కుమారి, రాజేశ్వరి, నూకరత్నం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండ కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 25 రోజు చేరుకుంది. వీరికి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కె. కుమారి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శాంతమ్మ, పి కుమారి, సోమేల అప్పలనర్స, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద 25వ రోజు సమ్మె కొనసాగింది. ఎటపాక మండలంలో అంగన్వాడి టీచర్ పద్మ మృతి చెందటంతో ఆమెకు నివాళులర్పించిఒ, ఐద నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, రంగమ్మ రాజేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.



విఆర్ పురంలో...



ఐటిడిఏ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, మిడ్డేమీల్స్ కార్మికులు

మిడ్డేమీల్స్ కార్మికుల నిర్బంధంపై అంగన్వాడీల ఆగ్రహం

- ఐటిడిఏ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-రంపచోడవరం

విజయవాడలో మహాధర్నాకు బయలుదేరిన మధ్యాహ్నం భోజన పథకం కార్మికులను గురువారం రాత్రి పోలీసులు నిర్బంధించడంపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిడ్డేమీల్స్ కార్మికులను నిర్బంధించడంపై శుక్రవారం మధ్యాహ్నం భోజనం కార్మికులు వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించగా, పోలీసులు నిరాకరించారు. దీంతో వారికి మద్దతుగా అంగన్వాడీలు శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఏ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రోడ్డుపై మీద బైఠాయించి గంట పాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ రంపచోడవరంలోనే మధ్యాహ్నం భోజనం కార్మికులు వినతిపత్రం ఇవ్వడానికి కూడా అనుమతించకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో కార్మికుల ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.మంగ. కలుముల లక్ష్మి, కె.బుల్లమ్మ, సిహెచ్.నవభారతి, సిహెచ్.సూర్యకాంతం, కె.అర్జమ్మ, మధ్యాహ్నం భోజనం యూనియన్ నాయకులు ఎమ్.రామలక్ష్మి. టి,కుమారి, యెస్.పద్మ, ఎమ్.బాపనమ్మ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ సరుకుల సరఫరా

- సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఆయా గ్రామాలలో వాహనాల ద్వారా సకాలంలో సరఫరా చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవీపట్నం మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సబ్ కలెక్టర్ పర్యటించారు. ఇందుకూరు, ఇందుకూరుపేట గ్రామాలలోని రేషన్ షాపులను సందర్శించి, అంగన్వాడి కేంద్రాలకు రేషన్ సరఫరాపై ఆరా తీశారు. ఎంపీయుపి స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎంతమంది సిబ్బంది ఉన్నది, రెవెన్యూ శాఖ ద్వారా ఏ సేవలు ప్రజలకు అందిస్తున్నదీ ఆరా తీశారు. ఇందుకూరుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సేవలుపై ఆరా తీశారు. అనంతరం పోలింగ్ బూత్‌లను సబ్ కలెక్టర్ పరిశీలించి, బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, బూతులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆర్అర్ కాలనీలను పరిశీలించి ముంపు బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సత్యనారాయణ, సిడిపిఓ సంధ్యారాణి, మండల విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి భయం

- టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:జగన్మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టీడీపి పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి సివేరి దొన్నుదొర అన్నారు. శుక్రవారం మండలంలోని మాడగడ పంచాయతీ చంపాగూడ గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన సంయుక్త మేనిఫెస్టో పై అవగాహన కల్పించారు. అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇస్తూ ప్రజలను జగన్ మోసం చేశారన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తామని చెప్పారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ ఉచితంగా తెలుగుదేశం అందిస్తుందని పేర్కొన్నారు. మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున నేరుగా వారి ఖాతాలో జమచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాడగడ మాజీ వైస్ సర్పంచ్ వంతల రాము, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, కిల్లో కుమార్, త్రినాథ్, సుబ్బారావు, వెంకట్రావు, భీమన్న, జగన్, వంతల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

పివిటిజి గ్రామాల అభివృద్ధికి కృషి

కేంద్ర గిరిజన వ్యవహారాల డిప్యూటీ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్

ప్రజాశక్తి- అరకు లోయ:ప్రధాన మంత్రి జన జాతి అదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంతో అదివాసీ (పివిటిజి) గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి సంపూర్ణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం అరకులోయ మండలం కొత్తభల్లు గూడ గ్రామంలో జరిగిన జన్ మన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పివిటిజి గ్రామాల గిరిజనులకు ఉచితంగా ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

సమగ్ర గిరిజనాభివద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, ఆదివాసి గ్రామాలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పాడేరు ఐటిడిఏ పరిధిలో 1597 పివిటిజి గ్రామాలలో సమగ్రమైన సర్వే చేసి నమోదు చేయడం జరుగుతుందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడానికి ప్రతిష్టాత్మకంగా పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు.అర్హత కలిగిన లబ్దిదారులు పథకాలు పొందడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పిడి బి. బాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ లీలా కృష్ణ, తహాసిల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.



కార్డులను ఇస్తున్న మనోజ్‌కుమర్‌సింగ్

నిలిచిన పోలవరం గ్రామసభలు

నిర్వాసితుల అభ్యంతరం మేరకు అధికారుల నిర్ణయం

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం నిర్వాసిత ప్రజానీకానికి పరిహారం, పునరావాసం నిమిత్తం మూడు రోజులుగా జరుగుతున్న పోలవరం గ్రామసభలు శుక్రవారం నిర్వాసితుల అభ్యంతరం మేరకు అధికారులు నిలిపివేశారు. మండల కేంద్రంలో 1508 ఇళ్లు ఉండగా, కేవలం 650 ఇళ్లు మాత్రమే సర్వే చేసి గ్రామసభలు పెట్టటంపై బాధిత నిర్వాసితులు తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. అంతే కాకుండా రసీదు పత్రాలపైనా, భూమి అప్పగింత పత్రాలపైనా నిర్వాసితుల సంతకాలు తీసుకోవడం, హౌసింగ్, ఆర్ అండ్ బి అధికారుల సర్వేలు పూర్తికాకుండానే స్ట్రక్చర్ వ్యాల్యూ లెక్క కట్టకుండా ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించడంపై కొందరు నిర్వాసితులు పోలవరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్యకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ప్రవీణ్ ఆదిత్య సమగ్రంగా అన్ని నిర్వాసిత నివాసాలను, అన్ని శాఖల ద్వారా పూర్తిస్థాయిలో సర్వే చేసిన అనంతరమే గ్రామసభలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో మూడవరోజు పూర్తి కావాల్సిన గ్రామసభ కేవలం నిర్వాసితుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇంటి పన్ను, వృత్తి పన్ను, కరెంటు బిల్లు, ఓటర్ ఐడి, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని నిలిపివేశారు. పూర్తిస్థాయిలో సర్వేల అనంతరం మళ్లీ గ్రామసభలు ఎప్పుడు నిర్వహించేది ముందుగా ప్రకటిస్తామని పోలవరం డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తాసిల్దార్ తెలిపారు.



గ్రామసభలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న పోలవరం నిర్వాసితులు

తెలంగాణ ప్రాంతాల నుండి తరలివచ్చిన నిర్వాసితులు..

గ్రామసభకు కచ్చితంగా హాజరుకావాలని తెలిజేయడంతో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన నిర్వాసితులు అనేకమంది వారి వద్ద ఉన్న ఆధారిత పత్రాలు తీసుకొని హాజరయ్యారు. అయితే అధికారుల నిర్వాకం వల్ల అర్ధాంతరంగా గ్రామసభలు ఆగిపోవడంతో పలువురు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వందల మైళ్ళ నుండి చింతూరు చేరుకొని వ్యయ ప్రయాసలకు ఓర్చి, చలిలో ఇబ్బందులు పడుతూ వచ్చామని, తీరా వచ్చాక అసంబద్ధంగా నిర్వహిస్తున్న గ్రామసభ తమకు తీవ్ర నిరాశ మిగిల్చిందని వారు వాపోయారు. ఇకపై పూర్తిస్థాయి సర్వేలు చేసి నిర్దిష్టమైన లెక్కలతో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను, ప్రభుత్వాన్ని నిర్వాసితులు కోరారు.

కెజిబివి టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- అనంతగిరి

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కొత్తూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న 36 మంది విద్యార్థినులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి 100శాతం మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని కోరారు. సూరెడ్డి బాబూరావు మాస్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఐక్యంగా కృషి చేసి పరీక్షల్లో మంచి మెరిట్ సాధించాలని సూచించారు. ఉపాధ్యాయ సిబ్బంది అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ లావణ్య, ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి అచ్చిబాబు, లెక్కల సత్యనారాయణ మాస్టార్ (రిటైర్డ్), సూరెడ్డి తేజ, ఉపాధ్యాయులు భారతి, వెంకటలక్ష్మి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేసిన అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, చిత్రంలో టీచర్లు, విద్యార్థులు

అనారోగ్యంతో గిరిజన విద్యార్థిని మృతి

ఆశ్రమ పాఠశాల వద్ద రోడ్డుపై మృతదేహంతో రాస్తారోకో

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని మడకం సంధ్య తీవ్రమైన కడుపునొప్పితో గురువారం రాత్రి మృతి చెందింది. పాఠశాల వార్డెన్, హెచ్ఎం నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందినట్లు సంధ్య తల్లి ఆరోపించారు. మృతురాలి తల్లి కథనం ప్రకారం... ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన సంధ్యకు తండ్రి లేరు. సంధ్య కూనవరం మండలం నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో చదువుతోంది. సంధ్య కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఈ నెల 3న తల్లి చూడటానికి వచ్చి, తమ కుమార్తెను తీసుకెళ్లిపోతామని చెప్పింది. అందుకు వార్డెన్, హెచ్ఎం అంగీకరించలేదు. తామే ఆసుపత్రి తీసుకెళ్తామని చెప్పి స్థానిక కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి ఆయాతో పంపించగా, వైద్యులు మందులు ఇచ్చారు. 4వ తేదీ ఉదయానికి కడుపునొప్పి ఎక్కువ కావడంతో తల్లికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె వచ్చి కుమార్తెను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యం అందించారు. అనంతరం ఇంటికి తీసుకొని రాగా, 4వ రాత్రికి కడుపునొప్పి తీవ్రమైంది. దీంతో ఆటోలో గౌరిదేవిపేట పిహెచ్‌సికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో సంధ్య మృతి చెందింది.



రోడ్డుపై విద్యార్థిని మృతదేహాన్ని ఉంచి రాస్తారోకో చేస్తున్న బంధువులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన

ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే సకాలంలో వైద్యం అందక తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ సంధ్య బంధువులు శుక్రవారం ఉదయం నర్సింగపేట ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వారికి సిపిఎం, టిడిపి, బిజెపి, ఆదివాసీ జెఎసి నాయకులు మద్దతుగా నిలిచారు. బాలిక కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో డిఇఒ, ఇతర అధికారులు వచ్చి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం గురించి పై అధికారులతో మాట్లాడి ఇప్పించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు.

ఆశ్రమ పాఠశాలలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

రాష్ట్రంలో ఆశ్రమం పాఠశాలల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ప్రభుత్వం వాటిపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నాయకులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య విమర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో అపారిశుధ్యం తాండవిస్తుందని, నాసిరకం భోజనం, అరకొర మౌలిక సదుపాయాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ఆశ్రమ పాఠశాలల్లో మరణాలు పెరిగాయన్నారు. మూడు రోజుల క్రితం ఏడుగురాళ్లపల్లి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 39 మంది విద్యార్థినులు అస్వస్థత గురైన విషయాన్ని గుర్తు చేశారు. ఆశ్రమ పాఠశాలలపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు మేల్కొని ఆశ్రమ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడబల్లి భాస్కర్, పొడియం అప్పారావు, బిజెపి నాయకులు నోముల రాంబాబు, సిపిఎం నాయకులు మడిం బాబూరావు, జెఎసి నాయకులు ముత్తయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' భోజన కార్మికుల ర్యాలీ



సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ చేస్తున్న భోజ న కార్మికులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని మండల కేంద్రంలో కళ్యాణ మండపం నుండి ఎంఈఓ కార్యాలయం వరకు సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట నినాదాలతో నిరసన తెలిపారు. మండల విద్యా శాఖ అధికారి కూడా కృష్ణమూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్, సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ, ప్రతి నెల ఐదవ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ధరలకు అనుగుణంగా మెను చార్జీలు పెంచాలని, విధుల్లో ఉండి ప్రమాదం జరిగితే ప్రమాద బీమా, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మీడ్డే మిల్స్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. సీపీఎం వైస్ ఎంపిపి పి.సత్యానారాయణ, జర్రెల ఉప సర్పంచ్ వి.గణపతి, గిరిజన సంఘం నాయకులు కె.నర్సయ్య, పి.రామదాసు, కార్మికులు కె.గురు, కె.గోపాల్, డి.రామారావు, పాత్రో పాల్గొన్నారు.

మాధవి గోబ్యాక్ : వైసిపి నేతల నిరసన



ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అరకు అసెంబ్లీ నియోజక వర్గంలో స్థానికులను వైసీపీ అధిష్టానం ఇన్చార్జిగా నియమించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండలంలోని అరకు వారపు సంతలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాన్ లోకల్ వద్దు లోకలే ముద్దు, మాధవి గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ, అరకు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో వైసిపి పార్టీకి మంచి నాయకులు ఉన్నప్పటికీ వేరే నియోజకవర్గం నుంచి ఎంపీ మాధవిని కేటాయించడం సరికాదని, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ఎంపిపి నీలవేణి, హుకుంపేట జడ్పిటిసి ఆర్.మత్స్యలింగం, ,వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ స్వామి, బి.సింహచలం, సిహెచ్ కృష్ణారావు, నైని సత్తిబాబు, రఘునాథ్, భాస్కరరావు, కోఆప్షన్ సభ్యులు మదిన కిరణ్ కోడా సింహాద్రి, ఆనంద్ పాల్గొన్నారు

అర్హులందరికీ నవరత్నాలు : జెసి



చెక్‌ను ఇస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-పాడేరు:నవరత్నాల పథకాలు అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్ స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా నిలబడుతుందన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు.తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, కొత్తగా మరో 1100 మందికి కొత్తగా వివిధ పెన్షన్లు మంజూరు చేసామని చెప్పారు.ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి డి.మురళి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోజన్ ఆధారిత ఇంధనంతో వాహన కాలుష్య నియంత్రణ

- గీతంలో ఐఐఎస్‌సి శాస్త్రవేత్త రవికృష్ణ



ప్రొఫెసర్ రవికృష్ణను సత్కరిస్తున్న గీతం ప్రతినిధి

ప్రజాశక్తి- మధురవాడ : వాహనాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించడానికి హైడ్రోజన్ ఆధారిత ఇంధనం భవిష్యత్తులో ప్రత్యామ్నాయం కానుందని బెంగళూరులోని ప్రఖ్యాత పరిశోధనా సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఆర్.వి.రవికృష్ణ అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశంలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 70 శాతం విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోందన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్లతో పెద్ద ఎత్తున కాలుష్య కారకాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయన్నారు. ఇలాంటి కేంద్రాల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ఇంధనంగా వాహనాలను నడుపుతుండడంతో కాలుష్యం తగ్గించాలన్న ఆలోచనలకు గండి పడుతోందన్నారు.

వాహనాలకు ఇంధనంగా వాడే విద్యుత్తును థర్మల్ కేంద్రాల ద్వారా కాకుండా సంప్రదాయేతర ఇంధన వనరులు, హైడ్రోజన్ ఆధారిత విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల ద్వారా అందినప్పుడే కాలుష్య తీవ్రత తగ్గించగలమని అభిప్రాయ పడ్డారు. కాలుష్య నివారణకు వాహనాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం దేశీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని,ఈ దిశగా బెంగళూరు లోని తమ అధ్యయన కేంద్రంలో పలు పరిశోధనలు చేస్తున్నామనివెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.జయకుమార్ కోఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు.

గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థుల రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్లను ఇస్తున్న ప్రొఫెసర్ రాజా పణిపప్పు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, బిజినెస్ స్కూల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్‌టిఆర్‌ట్రస్ట్ రక్తనిధి సౌజన్యంతో నిర్వహించిన రక్తదానశిబిరాన్ని గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా పణిపప్పు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకరు చేసిన రక్తదానం ఎందరి ప్రాణాలనో కాపాడుతుందని, యువత సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. బిజినెస్ స్కూల్ ఎన్ఎస్ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 200 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో విద్యార్థుల పాత్ర అభినందనీయమన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్ : పిఒ

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ ఇస్తున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమని, తద్వారా ప్రజలకు సేవ చేసే చక్కటి అవకాశం లభిస్తుందని పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ అన్నారు. శుక్రవారం ఆదివాసి గిరిజన భవనంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధ్యక్షతన ఏపీపీఎస్సీ గ్రూప్ 2 స్టడీ మెటీరియల్ 350 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ముఖ్యఅతిథిగా హాజరై ఏపిపిఎస్సి గ్రూప్ 2 అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా పిఒ అభిషేక్ మాట్లాడుతూ, కష్టపడి చదివితే తప్పకుండా మంచి ఫలితం వస్తుందన్నారు. పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పీ.అప్పలనర్స, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ, ఆర్థిక స్తోమత లేక మెటీరియల్ కొనుక్కోవడానికి చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం గిరిజన హక్కులు, చట్టాలు కోసం పోరాటమే కాకుండా నిరుద్యోగులకు పోత్సాహం అందిస్తుందన్నారు.మారుమూల గ్రామంలో ఉచితంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో జీవో 3 రద్దు చేయడంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు.గిరిజన ప్రాంతంలో నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారని కనీసం ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించలేని పరిస్థితిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు.ఇంత దుర్మార్గమైన పాలన ఎక్కడా చూడలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి గిరిజన యువతీ, యువకులను తీవ్రంగా మోసం చేశారని ఆయన మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మానపడాల్, ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటరీ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రి చిట్టీ బాబు, కుమారి, మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జి బాబు, కె.జగన్నధం, రమేష్, నానిబాబు, తదితరులు పాల్గొన్నారు

పథకాలతో పేదలకు లబ్ధి



పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- చింతపల్లి:మండలానికి ఒక్క వైయస్సార్ పెన్షన్ కానుక కింద ఏడాదికి రూ.34.92 కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లిలో వైయస్సార్ పెన్షన్ కానుక కింద నూతనంగా పెంచిన రూ.3000లను లబ్ధిదారులకు వైసిపి పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రాజుతో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చింతపల్లి మండలానికి నెలకు రూ.2.91 కోట్లు పెన్షన్ రూపంలో ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, ఇవి కాకుండా మరో 31 సంక్షేమ పథకాల రూపంలో మండలానికి భారీ ఎత్తున ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వైయస్సార్ పెన్షన్ కానుక కింద ఈ ఒక్క మండలానికే రూ.174 కోట్లు ప్రభుత్వం అందించిందని తెలిపారు. టిడిపి నాయకులు నమ్మశక్యం కాని హామీలను ఇస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీలో తొమ్మిది మంది వరకు పిల్లలున్న తల్లులను తాను గడపగడపకు కార్యక్రమంలో చూసానని అటువంటి వారికి అమ్మ ఒడి కింద ప్రతి ఒక్కరికీ రూ.15000 చొప్పున ఏడాదికి ఇవ్వడం సాధ్యమా అని ఆమె ప్రశ్నించారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేయడానికి టిడిపి ఇలాంటి తప్పుడు హామీలు ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, స్థానిక ఎంపిటిసిలు జయలక్ష్మి, పద్మ, మండల అధ్యక్షుడు మోరి రవి, జెసిఎస్ మండల కన్వీనర్ పాంగి గుణబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలోని విద్యా సంస్థల్లో గత మూడు నెలల నుండి జరుగుతున్న వరస విద్యార్థి మరణాలు కచ్చితంగా ప్రభుత్వా హత్యలే నని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ప్రభ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,గత డిసెంబర్ నెలలో విద్యార్థుల మరణాలను అరికట్టాలని దాదాపుగా 43 రోజులు ఐటిడిఏ ఎదురుగా దీక్ష నిర్వహించామని, అయినా కూడా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు.ప్రిన్సిపల్ సెక్రటరీ సర్క్యులర్ జారీ చేయడంతో ప్రజాప్రతినిధులకు, ప్రజా సంఘాల నాయకులకు గిరిజన విద్యాలయాల్లో పర్యవేక్షణ లేకుండా పోయిందన్నారు. అధికారులు బాధ్యత వహించి విద్యార్థుల మరణాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోస్ట్ మెట్రిక్ ఆశ్రమ గురుకుల వసతి గృహాల్లో నీళ్లు లేకపోవడంతో మరుగుదొడ్లకు ఆరు బయటే వెళ్లాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు.మెనూలో కోతలు విధించడంతో పౌష్టికాహారం అందక పిల్లలు రక్తహీనతతో బాధ పడుతున్నారన్నారు. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి అనేకమార్లు విన్నవించుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ముగిసిన టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో 60 రోజుల కుట్టుమిషన్ల శిక్షణ తరగతులు ముగిశాయని మండల అధ్యక్షురాలు ఈశ్వరి, కార్యదర్శి విజయాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి మహిళ కూడా స్వయం ఉపాధి పొందాలని ఆకాంక్షించారు.



ముగింపు కార్యక్రమంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు

ప్రజా సమస్యలపై పోరాటం

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్



మాట్లాడుతున్న కిరణ్

ప్రజాశక్తి-ఎటపాక

పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ఎక్కడికక్కడ పోరాటాలు చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రబోరులో సవలం రాము అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వరదలు, తుఫానుల వలన తీవ్రంగా నష్టపోయిన రైతులను పట్టించుకోకుండా, వారి పంటలను ఈ-క్రాప్ చెయ్యకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించని జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు చేస్తున్న పోరాటాలను గౌరవించి వారి డిమాండ్‌లను అంగీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఐవి, కాకా అర్జున్ దొర, ఎ.రాము, పద్మ, అజయ్, భద్రయ్య, వీరమ్మ, జయమ్మ, హరనాథ్, సత్యం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని పెద్ద గెద్దాడ గ్రామంలోని పోస్టాఫీసు వెనుక ఉన్న వాల్మీకి పేటలో నడికుడి రత్నకుమారికి చెందిన గడ్డివాముకి శుక్రవారం నిప్పంటుకొని అగ్నిప్రమాదం సంభవించింది.

దీనిని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలుపగా హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు పదివేల రూపాయలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ ఇన్చార్జ్ ఆర్ వెంకన్న, ఎల్ఎఫ్ బి రామచంద్రరావు, డిఓపి జె నాగేశ్వరరావు, పిఎంలు డిఎల్ నారాయణ, కే శంకర్రావు పాల్గొన్నారు.



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నేతల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : కాంగ్రెస్ పార్టీలో వైఎస్.షర్మిల చేరడాన్ని హర్షిస్తూ చింతూరు డివిజన్ కేంద్రంలో ఆ పార్టీ చింతూరు మండల కార్యకర్తలు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పిసిసి ప్రతినిధి ఎండి హబీబ్ మాట్లాడుతూ వైఎస్ షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీ ఏపీలో బలోపేతమవుతోందన్నారు. పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని చెప్పారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ మండల నాయకులు అహ్మద్ ఆలి, సొడే శ్రీను, జవహర్, కృష్ణమూర్తి, నరేష్, రామారావు, రవి, లాజం, ప్రసాద్, నాగేశ్వరరావు, సుబ్బయ్య, చట్టీ శ్రీను, బొడ్డు రవి, పెంటయ్య పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల పింఛన్లను రంపచోడవరం శాసనసభ్యులు నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తుందని చెప్పారు. రూ.2750 ఉన్న పింఛన్‌ను ఈ నెల నుండి రూ.3000కు పెంచినట్లు చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు వివిధ రకాలైన పింఛన్లు 4597 ఉండగా, కొత్తగా మరో 81 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, కొండ కుమారి, రంపచోడవరం సర్పంచ్ ఎం.బజ్జయ్య, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, గుర్రం వెంకటేశ్వర్లు, ఎంపీడీవో హరికృష్ణ, ఈఓపిఆర్‌డి ఆర్‌డి జాన్ విల్టన్, తోట రాజేశ్వరరావు, పండా రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అంత్యోదయ కార్డులివ్వాలని సిపిఎం ర్యాలీ



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ: మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని పివిటిజీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, ప్రతి ఒక్క కుటుంబానికి 35 కేజీల బియ్యం ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలో అనేకమంది పివిటిజిలకు 35 కేజీలు బియ్యం రా లేదని, కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్నా మంజూరు చేయ లేదని సిపిఎం మండల కార్యదర్శి కే రామన్న జి చిన్న బాబులు అన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పివిటిజిలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయకుండా తీవ్రంగా అన్యాయం చేస్తుందని విమర్శించారు. పి.వి.టి.జిలకు నిధులు కేటాయించకుండా నిలిపివేస్తుందన్నారు. సీసీడీపీ నిధులు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయవలసి ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క పైసా కూడా కేటాయించ లేదన్నారు. పివిటిజిలు గ్రామాల్లో రోడ్డు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్య అందించుటకు స్కూల్స్ మంజూరు చేయాలని,రాత్రి బడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆదిమ జాతి గిరిజనులకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల నాయకులు గెమ్మెలి చిన్నబాబు, పాంగి నాని బాబు, గత్తుం బుజ్జిబాబు కొర్రా చిట్టిబాబు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-పాడేరు:సమగ్రశిక్ష ఉద్యోగులు శాంతియుతంగా తలపెట్టిన విజయవాడ ఎస్.పి.డి ఆఫీస్ ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని అరెస్టులు చేయడాన్ని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఉమామహేశ్వరరావు, బోనంగి చిన్నయ్య పడాల్ తీవ్రంగా ఖండించారు. పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని శుక్రవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చట్ట ప్రకారం సమాన పనికి సమానంగా వేతనం చెల్లించాలన్నారు .హెచ్.ఆర్ పాలసీ, మినిమం టైం స్కెల్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అరెస్టు చేసిన ఉద్యోగులందరినీ విడుదల చేయాలన్నారు.

మిరియాల సాగుపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో మిరియాల సాగు పై స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమాల ద్వారా గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు అధికారి కళ్యాణి చెప్పారు. శుక్రవారం గుర్ర గరువు, మొదపల్లి గ్రామాల్లో కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. మిరియాల సాగులో సస్యరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశుభ్రతపై రైతులకు కళాజాత ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. రాయితీపై మిరియాలు, వలిచే యంత్రాలు, నాణ్యమైన ఉత్పత్తిపై గిరిజన రైతులను చైతన్యం చేశారు. మోదాపల్లి సర్పంచ్ కుర్ర మంగమ్మ, కాపీ రైతులు పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- తగరపువలస : కేంద్రప్రభుత్వ పథకాలపై శుక్రవారం భీమిలి మండలం సింగనబంద, నారాయణరాజుపేట గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ కెఎం సింగ్, డిప్యూటీ కార్యదర్శి ఎస్ ఎన్ మిశ్రా, సర్పంచ్‌లు గాడు వెంకటనారాయణ, కాద సూర్యనారాయణ, ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, ఎస్ఇఆర్‌పి డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఎంపిటిసిలు టి పైడి రాజు, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డైరీ, కేలండర్ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విఆర్.పురం : ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ముద్రించిన 2024 డైరీ, కేలండర్‌ను మండలంలో రేకపల్లి మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీడీవో ఫణీంద్ర రెడ్డి చేతుల మీద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు, మండల గౌరవ అధ్యక్షులు జల్లి బాబురావు, మండల అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యన్ జగదీష్, కోశాధికారి యం.బాబు, సహాధ్యక్షులు ఓ మంగరావు రెడ్డి, కార్యదర్శులు యస్ అజయ్, యస్ చందరావు, టి.అర్జున్, యస్ ప్రేమ్, ఎ.రాము, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డిగూడెంలో రెండు నెలల రేషన్ పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి - విఆర్.పురం : రెండు నెలలుగా రేషన్ బియ్యం సరఫరా కాని మండలంలోని వడ్డిగూడెం గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీకి తహశీల్దారు చొరవ తీసుకున్నారు. తమకు రెండు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వలేదని లబ్ధిదారులకు రెండు రోజులు క్రితం వడ్డిగూడెం గ్రామంలో ఆందోళన చేపట్టిన విషయం విధితమే. దీనికి స్పందించిన స్థానిక తహశీల్దారు ఎన్.శ్రీధర్ అదే రోజు ఘటన స్థలానికి చేరుకొని రెండు రోజుల్లో మిగిలిన బియ్యం ఇప్పిస్తానని మాట ఇచ్చారు. ఈ మేరకు ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి శుక్రవారం బియ్యం తెప్పించారు. శనివారం యధావిధిగా రెండు నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు సరఫరా చేస్తామని తహశీల్దారు తెలిపారు. దీంతో తహశీల్దారుకు లభ్యదారులు ధన్యవాదాలు తెలియజేశారు.

ట్రైబల్ వెల్ఫేర్ డీడీగా అబ్షలోమ్

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన సంక్షేమ శాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్‌గా కొండేపోగు అబ్షలోమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లాలో డిటిడబ్ల్యుగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేసిన జాన్‌రాజ్ నుండి ఆయన బాధ్యతలను స్వీకరించారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి- చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతూరు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ హిమోగ్లోబిన్ పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు చేతులు శుభ్రం చేసుకొని ఆహారాన్ని తీసుకోవాలని, ప్రోటీన్స్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తినాలని సూచించారు. స్త్రీలకు పీరియడ్స్ సమయంలో రక్తహీనత ఎక్కువగా ఉంటే ఐరన్ టాబ్లెట్స్ వేసుకోవాలన్నారు. నులిపురుగులు నివారణకు ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రాలను వేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం మాట్లాడుతూ మహిళల్లో అధిక రక్తహీనతను తగ్గించుకోవడానికి ప్రోటీన్స్ ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్, అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్‌సిహెచ్. నాగేశ్వరరావు, కె. శకుంతల, జి. హారతి, ఎస్. అప్పనమ్మ, ఎమ్. నాగమోహనరావు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ఈవీఎంలపై డిప్యూటీ తహశీల్దార్ ఎన్.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్వీప్ ఆక్టివిటీస్‌పై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు లక్ష్మణ్ రావు, ఇందిరభాయి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.